క్లుప్తంగా

పశువులకు టీకాలు తప్పనిసరి

పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి



గేదెలకు టీకాలు వేస్తున్న శ్రీలతరెడ్డి

మొయినాబాద్‌రూరల్‌: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని కనకమామిడి పశువైద్య అధికారి శ్రీలతరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కేతిరెడ్డిపల్లిలో పశువులకు టీకాలు వేశారు. ఆమె మా ట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పాడి పశువులు, గేదెలు అనారోగ్యానికి గురి కాకుండా ప్రభుత్వం సంవత్సరానికి రెండుసార్లు గా లి కుంటు నివారణ టీకాలు వేస్తుందని తెలిపారు.

పోతపాలు వద్దు.. తల్లిపాలు ముద్దు



తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

కొందుర్గు: శిశువులకు తల్లిపాలు మాత్రమే తాగించాలని, పోతపాలు తాగించొద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి పేర్కొన్నారు. మంగళవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం పద్మారంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందని, పుట్టిన శిశువుకు వెంటనే తల్లిపాలు పట్టాలని సూచించారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే బాలమృతంతో పాటు ఇతర పౌష్టికాహారం అందించాలని తెలపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి చేతన్‌సింగ్

కొత్తూరు: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పెంజర్ల గ్రామ సర్పంచ్ మామిడి వసుంధరమ్మ అన్నారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం పీఅండ్‌జీ పరిశ్రమ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సంస్థ ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం సంస్థ సభ్యులతో పాటు సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి రౌండ్‌టేబుల్ సంస్థ అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఇప్పటికే గ్రామంలో లక్షల రూపాయాలతో అత్యాధునిక సదుపాయాలతో కూడిన పాఠశాల భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. విద్యార్థులకు సాంకేతిక విద్యపై అవగాహన కల్పించడానికి కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువుల్లో ఉన్నతంగా రాణించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుమిత్ రానా, చేతన్‌సింగ్, నాయకులు రమేష్,అంజమ్మ, హెచ్‌ఎం జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీపీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించండి

సీఐటీయూ నాయకుడు రత్నం



మాట్లాడుతున్న రత్నం

మొయినాబాద్‌రూరల్‌: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రత్నం, పంచాయతీ కార్మికుల మండల అధ్యక్షుడు అంజనేయులుగౌడ్ కోరారు. కార్మికుల చేపట్టిన సమ్మె మంగళవారం 34వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఆటపాటలతో వంటావార్పు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి జీపీ కార్మికుల పట్ల చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కనీసం జీతాల పెంపు, ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డు కల్పించాలని సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోవడం విడ్డూరమని వాపోయారు. పంచాయతీ కార్మికుల వల్లే గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు సుధాకర్, కృష్ణ, అమృత, భారతమ్మ, స్వామి, అనసూయ, ప్రేమిళ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జర భద్రం



చాట్ బండార్ వద్ద పానీపూరి తింటున్న యువకులు

మొయినాబాద్‌: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది తినే ఆహారంపై శ్రద్ధ వహించడం లేదు. ఇంటి నుంచి బయటకు వెళ్తే ఎక్కడ ఏది దొరికితే అది తినేసి కడుపు నింపుకునే పరిస్థితి. తింటున్న ఆహారం ఎంత వరకు శుభ్రమైందో ఆలోచించడం లేదు.. ప్రస్తుతం వానాకాలం మొదలైంది. సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది. మనం తినే ఆహార పదార్థాలతోనే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుంది. అందుకే ఈ కాలంలో బయట ఆహారం తినడం ఎంతవరకు భద్రమో ఆలోచించాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి అతి చేరువలో ఉన్న రంగారెడ్డి జిల్లాలో అధిక శాతం మంది బయట ఆహార పదార్థాలు తినడానికే ఇష్టపడతారు. రోడ్ల పక్కన ఉండే చిన్న చిన్న బండ్లపై చేసే మిర్చీ బజ్జీ, పానీపూరి మొదలు కొని పెద్దపెద్ద హోటళ్లలో బిర్యానీ వరకు లాగించేస్తుంటారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో బయట తినే ఈ ఆహార పదార్థాలన్నీ ఎంతవరకు భద్రమో తెలియని పరిస్థితి. రోడ్ల పక్కన పానీపూరి, మిర్చిబజ్జీ బండ్లు, ఉదయం పూట టిఫిన్ బండ్లు చాలానే ఉంటాయి. అక్కడే తినడం, పక్కనే చేతులు కడగడంతో నీళ్ల నిలిచి దుర్వాసన, ఈగలు, దోమలు వస్తుంటాయి. వాటి వల్ల బ్యాక్టీరియాలు తినే ఆహార పదార్థాలపై చేరే అవకాశం ఉంది. అలాంటి ఆహార పదార్థాలు తిన్నవారు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముంది. ఇలాంటి ఘటనలు చాలానే జరుగుతున్నా కొన్ని బయటకు రావడం లేదు. హోటళ్ల లోనూ ఇదే పరిస్థితి ఉంది. జిల్లాలో చిన్న హోటళ్లతో పాటు పెద్ద పెద్ద హోటళ్లు సైతం ఉన్నాయి. వాటిలో ఆహారం నాణ్యతగా ఉందో లేదో తెలియని పరిస్థితి. కొన్నిసార్లు బిర్యానీలో పురుగులు రావడం, కర్రీల్లో ఈగలు రావడం వంటి ఘటనలు జరిగాయి. అలాంటి వచ్చినప్పుడు కస్టమర్లు హోటల్ నిర్వాహకులతో గొడవ పడి వెళ్లిపోతారు. కానీ హోటళ్లలో మాత్రం మార్పు రావడం లేదు.

అంతా ఇష్టారాజ్యం

- చాలా హోటళ్లలో మాంసం రెండు మూడు రోజుల పాటు ఫ్రిజ్‌లో ఉంచి దాన్నే వండి వడ్డిస్తున్నారు.
- అల్పాహారాలకు అందించే గట్టి చట్నీని కొందరు రెండు మూడు రోజులు నిల్వ ఉంచి.. వీలును బట్టి అందులో నీళ్ల కలుపుతున్నారు.
- ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో చైనీ వంటకాల్లో వాడే పదార్థాలను ముందే సిద్ధ చేసి నిల్వ ఉంచి వంటకంగా మారుస్తున్నారు.
- పాలు, పెరుగు విక్రయాల విషయంలోనూ నిర్ణీత వ్యవధి దాటినవే ఎక్కువగా విక్రయిస్తున్నారు.
- పానీపూరి బండ్ల వద్ద పరిశుభ్రత ఉండడంలేదు. ఒకరికి వడ్డించిన చేతులతోనే మరోకరికి పానీపూరి వేస్తున్నారు.
- బేకరీల్లో తయారు చేసే కొన్ని రకాల కేకులు 24 గంటల్లోనే వినియోగించాలి. కానీ అలాంటివి ఎక్కడా అమలు కావడంలేదు.
- మిర్చీ బజ్జీలను చేసే కడాయిల్లో నూనె నల్లగా మారుతున్నా.. అందులోనే వేయిస్తున్నారు.

తనిఖీలు శూన్యం

హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో తిను బండారాలు, ఆహార పదార్థాలను తనిఖీ చేయాల్సిన ఆహార భద్రత అధికారులు ఎక్కడా కనిపించడంలేదు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు మాత్రమే కొద్దిగా హడాహుడి చేస్తూ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. అన్ని రకాల ఆహార పదార్థాలో విచ్చలవిడిగా కల్తీలు జరుగుతున్నా, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకున్నా, నిల్వ పదార్థాలను యథేచ్ఛగా వాడుతున్నా, అపరిశుభ్రత తాండవిస్తున్నా అడిగే దిక్కేలేకుండా పోయింది. ఆహార భద్రత అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తనిఖీల విషయాన్నే మర్చిపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శుచి, శుభ్రత లేని ఆహారంతో ముప్పు

- బయట తిండితో ఆరోగ్య సమస్యలు

జాతీయ పోషకాహార సంస్థ సూచనలు

- తోపుడుబండ్ల నిర్వాహకులు విధిగా చేతులకు గ్లౌజులు, నెత్తిన టోపీ ధరించాలి.
- దుమ్ము అధికంగా ఉన్నచోట, మురుగు కాల్వల పక్కన నిర్వహణ నిషేధం.
- ఆహార పదార్థాలపై మూతలు తప్పనిసరి.
- కవర్లను నోటితో ఊదకూడదు.
- మరుసటి రోజు కోసం ముందే కూరగాయలు, ఉల్లిగడ్డలు కోసి నిల్వ ఉంచవద్దు.
- ఆహార తనిఖీ బృందాల పర్యవేక్షణ అవసరం.
- ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.
- శుద్ధి చేసిన నీటిని వినియోగించాలి.

బయటి ఆహారం మానేయాలి

ఏ కాలంలో అయినా బయటి ఆహారం మంచిది కాదు. చాలా మంది రోడ్ల పక్కన పెట్టే పానీపూరి, మిర్చిబజ్జీలు వంటివి తింటుంటారు. వాటివల్ల రోగాలు వచ్చే ప్రమాదం ఉంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాధులు మరింత త్వరగా ప్రబలే అవకాశం ఉంటుంది. ఈ సయమంలో బయటి ఆహారం తీసుకోవద్దు.

– వాణి, మండల వైద్యాధికారి, మొయినాబాద్

ఎస్‌ఐ కొలువే లక్ష్యంగా..



సౌందర్య



శ్వేత

షాబాద్‌: మండలంలోని కేశవగూడ గ్రామానికి చెందిన పామెన సౌందర్య ఎస్‌ఐగా ఎంపికయింది. ఆమె తల్లిదండ్రులు పామెన కృష్ణయ్య, మల్లమ్మ కూలి పనులు చేస్తూ కూతురిని చదివించారు. కానిస్టేబుల్‌గా మహేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తునే ఎస్‌ఐ పోస్టుకు అర్హత సాధించింది. మండలంలోని నవజీవన్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకుంది. తర్వాత బీటెక్(ఎలక్ట్రానిక్స్) పూర్తి చేసినట్లు తెలిపింది. 2018లో కానిస్టేబుల్‌గా అర్హత సాధించి, విధులు నిర్వహిస్తూ ఎస్‌ఐగా ఉద్యోగానికి సన్నద్ధమైనట్లు చెప్పారు. కూలి బిడ్డ ఎస్‌ఐగా ఉద్యోగం సాధించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్‌ఐగా రైతు కూతురు

షాద్‌నగర్‌రూరల్‌: నిరుపేద రైతు కూతురు ఎస్‌ఐగా అర్హత సాధించింది. ఫరూఖ్‌నగర్ మండలంలోని శేరిగూడకు చెందిన రైతు కొండం వెంకటయ్యగౌడ్, వనజ దంపతుల కుమార్తె శ్వేత ఎస్‌ఐ ఫలితాల్లో అర్హత సాధించింది. నిరుపేద కుటుంబంలో పుట్టిన శ్వేత కష్టపడి చదివి అనుకున్నది సాధించింది. తండ్రి వెంకటయ్యగౌడ్ ఎన్నో కష్టాలను ఎదుర్కొని కూతురుని చదివించాడు. తండ్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా శ్వేత ఎస్‌ఐగా అర్హత సాధించింది.

ఆరోగ్య రథం.. పేదలకు సంజీవిని



ఆరోగ్య సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌: 'ఆరోగ్య రథం' సేవలు గ్రామీణ పేదలకు వరం లాంటివని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలంలోని మేడిపల్లిలో మంగళవారం ఆరోగ్య రథం వైద్య సేవలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంపీ రంజిత్‌రెడ్డి తీసుకొచ్చిన ఆరోగ్య రథం సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా వైద్య పరీక్షలు చేయించుకుని మందులు తీసుకోవచ్చన్నారు. అవసరమైనవారికి ఇతర ఆస్పత్రుల్లోనూ చికిత్సలు చేయిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ శ్రీకాంత్, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ అంజయ్య, ఏఎంసీ వైస్‌చైర్మన్ రవూఫ్, బీఆర్‌ఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుంటాం

జెడ్పీటీసీ అవినాశ్‌రెడ్డి



ఆర్థిక సాయం అందజేస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్‌: ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకుంటామని జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొమరం బండకు చెందిన రైతు మల్కాపూరం నర్సింహులు ఆనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి వెంటనే రైతుబీమా సహాయం అందేలా చూడాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రానున్న రోజుల్లో బాధిత కుటుంబానికి మరింత అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.


గ్రామాల్లో స్వతంత్ర వజ్రోత్సవ వనాలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

శంకర్‌పల్లి: గ్రామాల్లో వజ్రోత్సవ వనాలను (పార్క్)లను ఏర్పాటు చేసి మొక్కలను నాటాలని ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ పేర్కొన్నారు. మంగళవా రం మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. స్వతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు అవుతున్నందున గ్రామాల్లో స్వతంత్ర వజ్రోత్సవ(పార్క్) వనాల పేరుతో పార్కులను ఏర్పాటు చేసి అందులో 750 మొక్కలను నాటడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి మొక్కలను అందించాలని సూచించారు. మొక్కలను నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతకు ప్రత్యే క చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, ఏపీఓ నాగభూషన్, కార్యదర్శులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోండి



మంత్రిసబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మొయినాబాద్‌రూరల్‌: జిల్లాలోని మొయినాబాద్, రాజేంద్రనగర్, గండిపేట్, శేరిలింగంపల్లి మండలాల మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ ఆధ్వర్యంలో మంత్రి సబితారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా అక్షయపాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తూ మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఆరోపించారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం మంత్రి సబితా రెడ్డి మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు భోజనం వండి వడ్డించేలా అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన జిల్లా అధ్యక్షుడు అజీజ్‌నగర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి స్వప్న, సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్లేష్, శేఖర్, శ్రీశైలం, గణేష్, సరిత, శిరీషా, నస్రీం, లక్ష్మి, ఫాతిమా, పార్వతి, రంగమ్మ, సుకమ్మ, పద్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయండి

కొత్తూరు: ప్రమాదాలకు నిలయంగా మారిన కొత్తూరు పట్టణంలోని జాతీయ రహదారి పెంజర్ల కూడలి వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజుచారి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కూడలి వద్ద సరైన వెలుతురు లేక రోడ్డు దాటే క్రమంలో వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే కూడలి వద్ద జరిగిన ప్రమాదాల్లో స్థానికులతో పాటు వాహనదారులు పదుల సంఖ్యలో మృత్యువాత పడినట్లు వివరించారు. కూడలిలో ప్రమాదాల నివారణకు లైట్లు ఏర్పాటు చేయాలని పలు మార్లు ఆయా శాఖల అధికారులకు విన్నవించిన ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూడలిలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

అభివృద్ధి వైపు గ్రామాల పరుగులు

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్‌: ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలతో గ్రామాలు అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నాయని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. పల్లెబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని బుచ్చిగూడ, వెలిజర్ల గ్రామాల్లో ఆయన పర్యటించి, ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో సీసీరోడ్లు, అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డు, క్రీడా ప్రాంగణాల వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

ఫరూఖ్‌నగర్ మండలంలోని వెలిజర్లకు చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ సర్పంచ్ వాద్యాల సుధాకర్‌రెడ్డి, బుచ్చిగూడకు చెందిన మాజీ సర్పంచ్ సామయ్య, నరేందర్‌రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు మంగళవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి గ్రామంలో క్రీడా మైదానం ఏర్పాటు చేసిందన్నారు. స్పోర్ట్స్ కిట్లు అందజేయడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని యువత క్రీడాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్‌బాబు, జెడ్పీటీసీ బంగారు స్వరూప, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకోండి

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



షాద్‌నగర్‌రూరల్‌: ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లులేని వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 10 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉందని వివరించారు. గృహలక్ష్మి పథకానికి సొంత స్థలం ఉన్న నిరుపేదలు అర్హులని, ప్రభుత్వం రూ .3లక్షల ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు ఆహార భద్రత కార్డు(రేషన్‌కార్డు), ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, ఇంటి స్థలం దస్తావేజులు, ఇంటి పన్ను రశీదు, కరెంట్ బిల్లు రశీదు, బ్యాంక్ ఖాతా జిరాక్స్, రెండు పాస్ ఫొటోలు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు తహసీల్దార్ కార్యాలయంలో, మున్సిపల్ పరిధిలోని ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని వివరించారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

కేశంపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాల్యమిత్రుడికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. మండలంలోని కాకునూర్‌లో తమతో పాటు పదవ తరగతి వరకు చదువుకున్న బాల్యమిత్రుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటికే పరితమయ్యాడు. దీంతో అతడి కుటుంబ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటుంది. మంగళవారం విషయం తెలుసుకున్న బాల్యమిత్రులు అతడికి నిత్యావసర సరుకులతో పాటు పది వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, వెంకటేష్, కృష్ణ, రమేశ్, మల్లేశ్, , సంఘమేశ్వర్, శ్రీనివాసులు, శివలింగం తదితరులు ఉన్నారు.

సారూ జీతాలు సరిపోతలేవు..

ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్న జీపీ కార్మికులు



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న జీపీ కార్మికులు

షాద్‌నగర్‌రూరల్‌: ప్రభుత్వం చెల్లించే వేతనాలు సరిపోతలేవని, మా డిమాండ్లు పరిష్కారించాలని జీపీ కార్మికులు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు మొరపెట్టుకున్నారు. మంగళవారం జీపీ కార్మికులు ఎమ్మెల్యేను కలిసి తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో జీపీ కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఒక్కరికి వచ్చే వేతనంలో ఇద్దరు, ముగ్గురు తీసుకుంటున్నారని తెలిపారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కనీస వేతనం కింద రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, ఆశవర్కర్ల వేతనాలను ప్రభుత్వం పెంచిందని, మీ సమస్యలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో జంగయ్య, యాదయ్య, మల్లేష్, నర్సింలు, భాగ్యమ్మ, కమల మ్మ, కృష్ణయ్య, నర్సింలు, పద్మమ్మ, ప్రమీల, బుచ్చమ్మ, పాల్గొన్నారు.

బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని నిరసన

టీఎస్‌ఎస్‌టీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కుబాయి



నిరసన తెలుపుతున్న ఉపాధాయ్యులు

మొయినాబాద్‌రూరల్‌: ప్రభుత్వం స్పెషల్ పాయింట్లు రద్దు చేసి బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలని టీఎస్‌ఎస్‌టీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కుబాయి, టీఎస్‌ఎస్‌టీపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సిద్ధం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో కలిసి వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బదిలీల్లో ఉపాధ్యాయులకు ఇచ్చే 10 ప్రత్యేక పాయింట్లు రద్దు చేసి ఉపాధ్యాయుల మధ్య సమానత్వాన్ని నిలిపి బదిలీలు, ప్రమోషన్లు జరిగేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయ సంఘాలు ముందుకు రావాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న శోభ

రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు శోభ

మొయినాబాద్‌రూరల్‌: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మహిళా అధ్యక్షురాలు దారెడ్డి శోభ అన్నారు. మంగళవారం మండలంలోని కేతిరెడ్డిపల్లిలో ఎనిమిది కాలనీల్లో ఎంపీ రంజిత్‌రెడ్డి నిధులతో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. శోభ మాట్లాడుతూ.. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ప్రోత్సహిస్తుందని అన్నారు. కేతిరెడ్డిపల్లి గ్రామంతో పాటు చాకలిగూడ, కంచెమానిగూడ అనుబంధ గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ, ఇంటింటికి నల్లా పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. కేతిరెడ్డిపల్లి ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ సిద్ధయ్య, వార్డు సభ్యులు లలిత, శారద, కుమార్, శ్రీకాంత్, ప్రశాంత్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.